
# అర్థంగాని కథ



## భమిడిపాటి రామగోపాలం

నాలుగు మైళ్ళు జొన్న చేలల్లోంచీ కంది కొయ్యల మధ్యనించీ నడిచి రోడ్డెక్కాడు డిప్యూటీ తాశిల్దార్ రవణమూర్తి. అతన్తోబాటు రివెన్యూ యిన్స్పెక్టర్ ఆంజనేయులూ ప్యూను సైదారావూ వున్నారు. అయినా వాళ్ళిద్దరికీ అతనికి మండినట్లుగా ఒళ్ళు మండడంలేదు.

ఒక్కమాటు వెనక్కి తిరిగి చూసేడు రవణమూర్తి, అణకువగానే వస్తున్నారు.

"లాస్టు బస్సు వెళ్ళిపోయుంటుందా ?"

"లేటయితే వెళ్ళుండదండీ"


లేటవలేదు. అదెప్పుడో వెళ్ళిపోయింది. ఆ చెప్పడం సాగసే అది.

ఎక్కడి పిడుగురాళ్ళ, ఎక్కడి రాజుపాలెం! ఇరవై మైళ్ళయినా వుంటుందేమో. అసలు రాత్రికి రాజుపాలెంలో కూడా ఆగకుండా తిన్నగా గుంటూరికే వెళ్ళిపోయి పొద్దుటే ఫస్టుబస్సులో రాజుపాలెం రాలేనా అనుకుంటున్నాడు రవణమూర్తి. ఆ ఎంక్వైరీలు కొండవీటి చాంతాళ్ళలా పెరిగిపోతూవుంటే గుంటూరు వెళ్ళగలిగే ఆవకాశాలు వొక్కొక్కటీ సన్నగిల్లిపోయాయి.

"ఇహ ఈ రాత్రికిక్కడే వుండిపోవాలన్నమాట. నేను అనుకుంటూనే వున్నాను. కొంచెం వేగిరం బయల్దేరవోయి దేముడా అంటే విన్నావుగాదు; నువ్వూ నీ పనికిమాలిన వ్యాపకాలూను!" అని విసుక్కున్నాడు రవణమూర్తి, ఆంజనేయులుమీద.

ఆంజనేయులు మాటాడలేదు.

"నాకు తెలుసు. నువ్వు మాట్లా



త్తను" అనుకున్నాడు రవణమూర్తి. అతనెప్పుడూ అంతే. మొదటి సెట్టు చీవాట్లకి మాట్లాడ్డు. బిక్కమొహం వేసి నుంచుంటాడు. రెండో సెట్టు తగిలితే అప్పుడు అదికాదాస్సార్ అంటూ ఏదో సొద ప్రారంభిస్తాడు. ఈ లోపుగా కోపం చల్లారిపోయిందా సరే సరి.

"అసలు నువ్వు నన్నివాళ కిక్కడుంచేద్దామని మొన్నట్నించి ప్లాను వేసుకున్నావు."

"అబ్బే. లేదాస్సార్."

"అబ్బే లేదా మిటి; అంతా నాటకం! నన్నేవడింట్లోనో మకాం పెట్టమంటావు అక్కణ్ణించి వీడు మునసబుసార్ వీడు సుబ్బారెడ్డండీవీడు నరసింహయ్య అంటూ ఎవడెవణ్ణో తీసుకొచ్చి నా పీకలమీద సవారీ చేయిస్తావు. వాళ్ళ పితూరీలన్నీ వింటూ కూచోవాలి నేను ...... అసలీ ఓక్కుమాలిన వూళ్ళో కుభ్రమైన తిండైనా దొరకదు."

"అఁ అదేంమాటసార్. మొన్న నంటే తమరొచ్చినప్పుడు బంగారమ్మగారు ఊరెళ్ళిందిగాని. ఆ పెద్ద హోటల్లో అన్నం బాగుండక పోద మేమిటిసార్. కలెక్టర్ సుబ్రమణ్యం గారి దగ్గర్నుంచీ ఆవిడచేతి భోజనం కోసం యిక్కడ నైట్‌హాల్టులు వేసేవారు."

"ఊరుకోవోయ్; మంచీ చెడ్డా లేకపోతేసరి! నేను సాయింత్రాని కల్లా గుంటూరు పోతాను. ఎంక్వయిరీలు త్వరగా అఘోరించవయ్యా అవి నిన్నట్నించీ శతవిధాలపోతేను. అంతా మర్చిపోయి. బిప్పులన్నీ దాటించేసి - బంగారమ్మ చేతిభోజనంకోసం ఇక్కడ నైట్‌హాల్టు వెయ్యాలిట, నైటు, హాల్టు!"

మరొక్క రెండు నిమిషాలు విశ్రాంతంగా నడిచేసరికి నాలుగురోడ్ల సెంటరు వచ్చింది.

ఇద్దరు సర్దుకుంటూ, ఆ సంగతి జనానికి తెలియకుండా వుండేందుకు నడుంమీద చేతులువేసుకు నిలబడ్డారు రవణమూర్తి, ఒబీడియెంట్‌గా అంజ్లు నేయులూ సైదారావూ - చేతికంత నంతదూరంలో - నిలబడ్డారు.

"పోనీ. లారీలేవైనా వొస్తాయేమో; ఇక్కడ నిలబడదాం; కొంతసేపు." అన్నాడు రవణమూర్తి.

ఆ౦జ నేయులు బుర్రగోక్కున్నాడు. పక్కకితిరిగి చూసే సరికి మోతాదు కర్రపట్టుకొని వినయంగా నుంచుని కనబడ్డాడు. తడుముకోకుండా అతనికి ఆర్డర్లు జారీచేస్తున్నాడు అతను" - మునసబుగారి మేడమీద గది ఖాళీచెయ్యమను. ఆఫీసరుగారూ డిటీగారూ వచ్చేస్తున్నారని చెప్పు. మా యింటికిపోయి పడక్కుర్చీ గుడ్డ ఎత్తకపో ... కుర్చీ అవసరంలేదు. అవును. మునుసుబింట్లో కుర్చీ మంచిదే. ఆమీన బంగారమ్మగారింటికివెళ్ళి రెండు భోజనాలు చెప్పు.

ఒకటి స్పెషల్ - బంగాళాదుంపల వేపుడు, తాజానెయ్యి -

"ఆంజనేయులు, అటు చూడు!"

గురజాలవైపునుంచేదో వస్తోంది.

"లారీ లావుంది, కదూ!"

"లారీ కాద్సార్, అది! ఏదో చిన్నకారల్లేవుంది"

"ఆపి చూడు."

"వాళ్ళావరుసార్. నాగార్జున సాగర్ చూట్టాని కొచ్చేవాళ్ళు. లిఫ్టిచ్చే బాపతుగాదు.

నిమిషంలో లైట్లు దగ్గరయ్యాయి. "ఆంజనేయులన్నది రైటే. ఇది లారీ కాదు." అని నిరుత్సాహ పడ్డాడు రవణమూర్తి.

రాను రాను ఆ ఆకారం జీపుగా తేలింది.

"ఆర్. డి. వో. జీపు కాదుగదా." అన్నాడు రవణమూర్తి.

"గవర్నమెంటాఫ్ ఆంధ్రప్రదేష్" అన్న అక్షరాలు కనబడ్డాయి. ఆంజనేయులు ఆదుర్దాను సూచిస్తూ రోడ్డు మధ్యకివెళ్ళి చేతులడ్డం పెట్టాడు.

జీపు ఒక్క కుదుపుతో ఆగింది. ఫ్రంటు సీట్లో ఎవరో స్త్రీ కూర్చుని వుంది.

"తస్సదియ్యా!... వీళ్ళ బ్లాకు బుపాడుగాను." అన్నాడాంజనేయులు.

బ్లాకువాళ్ళు బొత్తిగా పనీ పాటా లేనివాళ్ళని రవణమూర్తి కూడా బాధే, అయితేమాత్రం- కలకల్లాడుతూ గంటకో రంగు చొప్పున చీరా వేషం మారుస్తూ రోజాకోపూవు క్యాంపు తిరుగుతూవుండే అమ్మాయిల్ని ఇంకో డిపార్టుమెంట్లో ఇంతమందిని వెదకటం అసాధ్యం. ఆ మాటకొస్తే వాళ్ళు పని చెయ్యనే అక్కర్లేదని, వాళ్ళు అలా జీపుల్లో తిరిగి నలుగురి కళ్ళూ పడితే బ్లాకుల దెవలప్మెంటు దానంతట అదే అయిపోతుందనీ కూడా అతని కెవరో చెబితే ఔను కాబోలనిపిస్తూ వుంటుంది.

"జీపుగుంటూరేనాండి, హెయ్యేడి..." ఆంజనేయులు ఆమె నడిగాడు,

ఫ్రంటుసీట్లో కూర్చున్నస్త్రీ జవాబు చెప్పలేదు. "అరె!" అని అస్పష్టంగా ఏదో అరచింది. "రవణమూర్తీ - నువ్వేనా!?" అంది, వెంటనే.

రవణమూర్తి వణికిపోయాడు.—

స్త్రీ ఎవరో

ను — వ్వని —

నువ్వేనా-అని-పలకరించింది.

ఈ వణుకు పులకరింపు -

అతను దగ్గిరగా వచ్చేడు..

ఎవరెవ రెవ రెవరూ?

. స్వరళబాల !!!

పోల్చలేదూ? నేనూ! సరళబాల నోయ్!

రవణమూర్తికి ఆశ్చర్యంతో నోట మాట రాలేదు.

సరళబాల ఎవరు?

అదొక మనిషా?.... హ్హ హ్హ హ్హ ... అదెలా కుర్మదుంది? అదొక ఝంఝూమారుతం .... నిరంతర

దిగ్భ్రమ కలిగించే వాక నయాగరా జలపాతం.... 132 కె.వి.జనరేటర్.... పడిలేచే కదలితరంగం.... సుడిగాలిలా ఎగిరే పతంగం....

పదేళ్ళక్రితం విజయనగరం కాలేజీలో బి. ఏ. బి. ఎస్సీ, బి. కామ్ క్లాసుల్లోనూ; అటు సప్లిమెంటరీ యస్పెస్పెల్సీ పెక్షన్లలోనూ సగానికి పైగా లెక్చరర్సులోనూ ఒక్కడంటే ఒక్కడు మరిచిపోలేని సజీవశిల్పం సరళబాల.... అవును. ఆ ఎటెండెన్స్ రిజిస్టర్సులో ఎక్కడా లీవులూ, ఆబ్సెంట్లూ ఆఖరికి లేట్ మార్కులూ వుండవు. ఏడు వందల ఎనభై నలుగురు మగస్టూడెంట్లూ ఇరవై నలుగురు యంగ్ లెక్చరర్సూ వరసగా మూడేళ్ళపాటు రోజూ హైము తప్పక కాలేజీకి హాజరై పోతే-కాలేజీ మెయిన్‌గేటు కెదురుగా ఉన్న మేడ పిట్టగోడ కానుకుని నిలబడడానికి నేనంటే నేనని కుర్రాళ్ళ తగువులు పడితే-కుసురూ; ఎవరో హెడ్డాఫ్ ది డిపార్టుమెంటుగారు చని పోవడమూ, రాజాగారి బర్త్ డే-వీటివల్ల కాలేజీకి సెలవొస్తే అందరూ విచారంగా గడిపారంటే - రోజుకి రోజూ పోటా పోటీలుగా మొగకుర్రాళ్ళు వాళ్ళని చూసి ఆడపిల్లలూ శుబ్రంగా తయారయి పోయేరంటే - వాటన్నిటికీ సరళబాలే బాధ్యురాలు. ఆ మూడేళ్ళూ ఆకాలేజీకి మారిపోని వసంతరుతువు!

"అయామ్‌సారీ, ఐహేవ్ మిస్టేకెన్" అంటోంది సరళబాల.

"నోనో; యు హేవెంట్....నేను ...కన్‌ఫ్యూజ్ అయిపోయాను...." అన్నాడు కలెక్టరుగారితో మాట్లాడినంత కంగారుగా.

"గుంటూరు వెళ్ళాలా? .... జీపు గుంటూరు వెళ్ళడంలేదు, రాజుపాలెం వరకే., కమాన్. రాజుపాలెం వచ్చి మా యింట్లో ఓ రోజు ఉండి వెళ్తే సంతోషం .... ఇంతకీ ఏం చేస్తున్నా విక్కడ?"

వరసగా మాట్లాడేస్తూ చకచకా జీపు దిగిందామె.

రవణమూర్తి అన్యమనస్కంగానే "నేనా?...రివిన్యూ డిపార్టుమెంటే - ఇనామ్స్‌డిప్టీతాసిల్దార్‌గా వుంటున్నాను. నేనొచ్చేదీ రాజుపాలెమే" అన్నాడు.

"దట్సగుడ్! . రాణీ! నువ్వు బేక్ సీట్సులో ఎక్కడన్నా సర్దుకో" అంది సరళబాల. డ్రైవర్ పక్కనున్న యింకో స్త్రీ వెనక్కి-వెళుతోంది.

"గెటిన్-రమణమూర్తీ!

రవణమూర్తి సందేహించేడు "పోనీ నేను-బేక్‌లో...."

ఫరవాలేదు; ఎక్కవయ్యా!"

"సైదారావూ: ఫస్టు బస్సులో రాజుపాలెం వచ్చేసెయ్" అని జీపు ఎక్కేడు రవణమూర్తి.

* * *

జీపు చర్రుమని వెళ్ళిపోతున్నాది.

సరళబాల కుడిచివర్న కూర్చుంది. రాజనాలీ చిన్న తుంపర్లూ ప్రారంభమ య్యాయి. చీరకొంగు నెత్తిమీంచి

తీసుకొని చెవులు కప్పుకుంది ఆమె. వాగ్ధోరణి అలా సాగిపోతూనే వుంది.

"ఇంకా నువ్వు డిప్యూటీ తాసిల్దారేనా? ఊరికే డిస్టింక్షన్లూ మెరిట్ ప్రైజులూ కొట్టేసేవాడివి. ఏ. ఐ. ఏ. ఎస్. ఆఫీసరో అయిపోయి ఎక్కడో కలెక్టరుగానో డిపార్టుమెంటు హెడ్‌గానో ఉన్నావనుకుంటున్నాను. జీపైనా లేకుండా జిల్లా అంతా తిరుగుతున్నావా? వాటే పిటీ! అది సరే-అసలు నువ్వు ఈ గుంటూరు జిల్లాకే ఎట్లా చేరావంట! గ్రూప్ త్రీ సర్వీసెస్‌కి సెలెక్టయి వచ్చేవన్నమాట. చూసి చూసి మంచి జిల్లాకే పోస్టు చేసేరే. ఇంకో చోటైతే అసలే తుప్పు పట్టిపోయి వుండేవాడివేమో - ఎనీవే - ఐయామ్ సోగ్లాడ్. అన్నట్టు శీతో చదువుతూ వుండేదే కోమల-వాళ్ళంతా వంకాయ ముచిక అంటూ వుండేవాళ్ళు - ఆవిడ వెస్ట్ బెంగాల్లో వుమెన్స్ వెల్ఫేర్ డైరెక్టరిణిగా వుంటోంది తెలుసా! . మరి నీకెప్పుడూ లెటర్సేనా రాయదా? ఓ! మీరిద్దరూ చాలా క్లోజ్‌గా ఉండేవాళ్ళే-కాన్‌స్క్రిప్ట్ స్టూడెంట్స్ మీరిద్దరే గనక - తప్పదులే .... ఎక్మ్రిని స్ట్రిషన్లో ఏముందోయ్, ప్లానింగ్‌లోకి రా, బాగుంటుంది! నిన్ను ఎస్. ఈ. ఓ.గా తీసుకుంటాంగా! ... నీకు ముగ్గురు పిల్లలా! బాగుంది ఈపాటికి ఆపుచెయ్యి. ఫామిలీ ప్లానింగు ఇప్పుడు మన నేషనల్ స్లోగన్ కదా. ఎక్స్‌క్యూజ్ మీ .. అడగడం మరిచేపోయాను-నీ వైఫ్ బాగుంటుందా? ...

రమణమూర్తి అట్టే మాట్లాడలేకపోతున్నాడు, ముక్తసరిగా సమాధానాలు యివ్వడానికే కష్టంగా వుంది,

చుట్టూ ఉన్నవాళ్ళు కొత్త. ఇలాంటి సన్నివేశానికి అతను తయారుగాలేదు. గవర్నమెంటు జీపుల్లో అతను చాలాసార్లు యిలా ప్రయాణాలు చేసేడు. అలాంటి ఏ సమయంలోనైనా వచ్చే ధోరణి వేరు. యూ. డీ. గుమాస్తాల లిస్టులు: డి. టి. లిస్టులు; ఏ తాసిల్దార్ ఎలాంటివాడని ఎవరెవరెంతెంత వెనకేసేరని- కలెక్టరాఫీసు విశేషాలు ఇలాంటివి చర్చకొస్తాయి. జీపులో డిప్యూటీ కలెక్టరైనా మరెవరైనా పెద్ద అధికార్లుంటే-వారి వాక్యాలకు అనుబంధాలుగా వస్తాయి ఇతరుల మాటలు. కలెక్టరుగారి పాలనా దక్షత; వారు ఏ ఏ ఫైల్సులో ఎంతెంత బ్రహ్మముడుల్లాంటి కొర్రీలు వేసి ఆఫీసును గజగజలాడించిందీ చర్చల్లో కొస్తాయి- వారి గొప్పబాతేకథలకు ప్రచారం జరుగుతుంది.

వీళ్ళు 'ఏమిటి, ఎందుకిట్లా జీపు తీసుకు గురజాల వైపు వెళ్ళేరు. వెనకాల, వున్న ముగ్గురు ఎవరు; ఏం తెలియడంలేదు,

సరళబాల తనకి తెలిసిన మనిషనుకుంటే అదీ పొరపాటులాగే ఉంది.

ఏనాటి విజయనగరం కాలేజి! ఏదో కాలం గడపడానికి.పదిహేడేళ్ళకి

ఉద్యోగం ఎవరూ యివ్వరు గనుక ఉన్న వూళ్ళో నాలుగేళ్ళు స్వప్నద్వారా గడపవచ్చు. మార్కులు తెచ్చుకుంటే గాని పరీక్షలు ప్యాసు చెయ్యరు. గనుక పుస్తకాలతోకు సీలు. డ్రామాటిక్ ఎసో సియేషననీ గేమ్స్ అండ్ స్పోర్ట్సుఅనీ ఇలాంటి పిచ్చి పిచ్చి వేషాలు అత నెప్పుడూ ఎరగడు. పరీక్షలు పోగొట్టు కొనే స్తోమతవున్నవాళ్ళకి, అవన్నీను.

ఈ కొత్తవాళ్ళ మధ్య ఇన్నేళ్ళ తర్వాత ఆమె తనని ఎంతో పరిచయం వున్న మనిషిలాగా సంబోధిస్తూ చక చకా మాట్లాడేస్తూ ఉండడానికి కారణ మేమిటో ?

జీపు ఆగేటంత వరకు ఆమె ఆగ కుండా మాట్లాడుతూనే వుంది.

"అరె! తలుపు తీసేవుందే! క్రిష్ణారావొచ్చేశాడా ?" అంటూ జీపు దిగింది సరళబాల.

రవణమూర్తి గుమ్మంలో నిలబడి పోయాడు.

ఈ సరళబాల పెళ్ళి చేసుకున్నదా ? పిల్లలున్నారా ? లేనట్టేవుంది.. క్రిష్ణా రావొచ్చేశాడా అంటోంది-మొగుడేనా, ఆ క్రిష్ణారావు !.... ఈవిడ దేకులమో ? ఈ రాత్రి కి క్కడ భోంచెయ్యాలి కాబోలు .

"రావోయ్, రా ! లోపలికిరా ! అక్కడే నుంచున్నావేం?....దుర్గయ్యా వారి బెడ్డింగు లోనపెట్టు. రామయ్య దుకాణానికి వెళ్ళి ఓ డజను చక్కెర కేళీలు నిమ్మకాన్నిన్ని తెచ్చిపెట్టు. సీతపీ రాజీసీ పొద్దుట ఏడింటికి రమ్మని చెప్పేసి నువ్వింటికి వెళ్ళు...." అన్నది సరళబాల.

లోపల్నించి ఓ నడివయస్సావిడ వచ్చింది. చీరకొంగుతో చేతులు తుడుచుకొంటూ, దుర్గయ్య వెళ్ళాడు.

"ఏం మంగమ్మా క్రిష్ణారా వొచ్చేడా ?"

"లేదమ్మా, ఇంతకుముందే ఎవరో ఒకయ్య ఒచ్చిపోయినాడు. ఆయనగారు రేత్రికి రాడంట. కబురు జేరినటయా నికే వొంటయి పోయింది."

"సరే అదీ వొకందుకు మంచిదే. నువ్వు లోనకు బోయి ఈ అయ్యగారికి స్నానానికి వేణ్ణీళ్ళు బెట్టు."

"అలాగేనమ్మా" అని ఆవిడ రవణమూర్తికేసి పరీక్షగా చూస్తూ వెళ్ళింది.

• • •

అతను రేడియో దగ్గిర కూచ్చు న్నాడు. అతని మనస్సులో ఆకారం లేని ఆలోచనలు ముసురు కుంటు న్నాయి. యీమె ఎటువంటి మనిషి ! .. తనని మాట్లాడనివ్వడంలేదు .... అన్నీ టేకెన్ ఫార్ గ్రాంటెడ్ గా చేసు కుపోతోంది, చెప్పుకుపోతోంది. యీమెని తిన్నగా పలకరించడానికి ప్రాథమిక విషయాలు అడగడానికి తనకి మనసు కూడిరావడంలేదు. ఆమెని "మీరు" అనాలా, "నువ్వు" అనాలా అన్న విషయం మీద తన

కింకా సందేహం తీరేదు. ఆమె మాత్రం దబాయించి "నువ్వు" అనేస్తోంది, చనువు తీసుకొంటోంది. ఎంత వరకూ అంటే - కాలేజీలో చదివేటప్పుడు తనతో కంబైన్డ్ స్టడీ చేసిందాన్లాగ. తనకి ఆమెని "నువ్వు" అనాలంటేనే ఏమిటోగా వుంది. చిన్నప్పటి క్లాస్‌మేట్సందర్నీ "నువ్వు" అనవచ్చా ?

మొన్న ఆమధ్య వెంకట్రావు తిరుపతి వెళ్తా గుంటూర్లో కనబడ్డాడు. హలో అంటే హలో అనుకున్నారు. "నువ్వు బాగా లావెక్కావోయ్" అంటే "నీకప్పుడే బట్టతల అయిపోయిందోయ్" అనుకున్నారు. ఓయి, ఓయి అంటూ సంభాషణ చాలాసేపు సాగాక వెంకట్రావే "చూసేవా మనం, మన ఫాల్స్ ప్రెస్టేజీలున్నూ ! చిన్నప్పుడు ఒరే వెధవా అంటే ఓరి నీ తస్సాచెక్కా అనుకొనేవాళ్ళం. ఇప్పుడు ఓయ్‌లోకి దిగేం - కొన్నాళ్ళుపోతే ఏమండోయి అని పలకరించుకుంటాం గాబోలు అన్నాడు - అతరవాతైనా అతన్ని ఒరే వెంకట్రావు అనడానికి నోరు రాలేదు.

ఈమెతో అసలు పరిచయంకూడా లేదే ! చదువు అంతా కో-ఎడ్యుకేషన్ సిస్టమ్‌లోనే సాగినా అది రిజర్వ్‌డ్‌గా బెరుగ్గా గడిపిన కాలం, అమ్మాయిల్ని పలకరిస్తేనే చెప్పుతీసి కొడ్తేస్తారని భయపడిన రోజులు,

ఫోంచేస్తున్నప్పుడు రెండు మూడు సార్లు "నువ్వు" అన్నాడు ఆమెని. గుండె జోరుగా కొట్టుకుంది. ఆమె అదేమీ పట్టించుకోలేదు. "మీరు" అని రెండు మూడు సార్లు అన్నాడు- మనోమనకి "మీ రు" మీరంటూ "మన్నించుకోవడాలు దేనికి" అంటుందేమోనని ఆమె కళ్ళలోకి చూసేడు. ఆమె అదికూడా పట్టించుకోలేదు. ఏదో ఆవేశంలో పడ్డదాన్లాగ తను మాట్లాడా లనుకున్నదేదో మాట్లాడుతూనేవుంది.

"భోజనం నీకు నచ్చిందా ; మీరు వెజిటేరియన్స్‌కదూ ! క్రిష్ణారావుకూడా వెజిటేరియనే. ఎగ్గుకూడా ముట్టుకోడు" అంది సరళబాల.

రవణమూర్తి తలెత్తి - రేడియో మీదికి చూశాడు, అక్కడ కార్డు సైజు ఫొటో ఒకటి చట్రాంలో బిగించి స్టాండ్ వేసుంది. అందులో వో-చురకత్తిలాంటి సుందర పురుషుడున్నాడు. అప్రయత్నంగా దాన్ని అటూ యిటూ తిప్పిచూశాడు. చూస్తూ ఓ క్షణం సరళబాలవేపు చూశాడు. ఆమె కళ్ళల్లో అత్యంతానంద సూచకమైన కాంతి మెరసింది. "చూసేవా, నే నెలాంటి వాణ్ణి ఎంచుకున్నానో" అని ఆచూపును భాషాంతరీకరణం చేయవచ్చు.

"ఇతన్నెక్కడో చూసినట్టుందే" అనుకుంటూ "నువ్వు - మేరేజి చేసుకున్నావా ?" అన్నాడు.

సరళబాల పకపకా నవ్వింది.

"మాగొప్ప ప్రశ్న అడిగావులే"

అన్న వేళాకోళం వుంది, అందులో. కాని అతనికి తెలియలేదు.

"అతన్ని నీకు తెలీదా? మనకి నాలుగు సంవత్సరాలు సీనియరు. ఎం. ఏ ఎస్. ఎల్. బీ అయ్యేడు. కొన్నాళ్ళు లెక్చరర్ పనిచేసి మానేశాడు. ఎడ్వకేట్‌గా ఎన్రోల్ అయ్యేడు గాని ప్రాక్టీస్ చెయ్యలేదు ..... మూడేళ్ళనించీ ఇక్కడే వున్నాడు.... పెళ్ళి గురించి సందేహం - ఫస్టైం నీకే వచ్చింది." అన్నది సరళబాల సన్నగా నవ్వుతూ.

"ఎక్స్‌క్యూజ్మీ

జ్ఞాపకంవచ్చిన క్రిష్ణారావుని తలచుకుని, అతను ఇద్దరు పిల్లల్నీ భార్యనీ తండ్రి దగ్గరవదిలేసి యీమెతో రావడం ఊహాలోకిరాగా తడబడి - ఏవో తెలియని పశ్చాత్తాపంలోపడ్డాడు. అడగకూడని ప్రశ్న, బహుశా అడగకూడని సమయంలో అడిగానేమో అనుకున్నాడు.

"అతనెక్కడి కెళ్ళాడివాళ?'

"ఇవాళకాదు. నిన్న గుంటూరు కెమిరా క్లబ్బులో అతని ఫ్రెండొకడున్నాడు. అతనొచ్చి తీసుకుపోయాడు."

"మొత్తంమీద పెళ్ళిచేసుకోడం మానేసి ఎవరికీ ఏం పెట్టకుండా ఇలా తప్పించుకొని కాలక్షేపం చేస్తున్నావన్న మాట."

"ఏదీ- ఎవరిమట్టుకు వాళ్ళే ప్రత్యేకంగా వొచ్చి డిన్నర్పుతిని పోతున్నారుగా! ........ హ హ హ - నీతోనే మొదలైందనుకో— హ హ హ"

అతను మాట్లాడలేదు.

"ఏం, మాట్లాడవు?"

"ఏం లేదు—"

సరళబాల మంచం అంచున వ్రేలాడే పరుపుమీద అంటీ అంటనట్టు కూర్చుని, కాళ్ళూపుతూ మెత్తగా వూగుతోంది.

"ఇవాళ నా కెంత సంతోషంగా వుందో చెప్పలేను. మనవూరు; ఆ కాలేజీ; తెలిసీ తెలియని - బాధ్యతల్లేని ఆ రోజులు - అన్నీ జ్ఞాపకం వస్తున్నాయి నిన్ను చూసేసరికల్లా యీ పదేళ్లూ గడవలేనట్టు - అంతా నిన్న మొన్నలాగుంది."

విరిచి విరిచి మాటాడుతోంది సరళబాల బహుశా మనసారా అంటోందేమో. నవ్వుతూ ప్రసన్నంగావున్న ఆ ముఖంవెనక ఏదో బరువైన పారవశ్యం పరధ్యానం కనబడుతోంది. వయస్సులో వున్నప్పటి అనుభవం జ్ఞాపకంవస్తే పునర్యవ్వనం వచ్చినట్టు కులాసాగా ఉంటుంది కాబోలు ...... కాని అందరికీ స్మరణీయమైన అనుభవాలు వుండవు.

అలాడ్రెస్ చేసుకోడం ఆమెకి'అలవాట్లా వుంది. పుష్టి ఛాయాగల శరీరమేమో; పల్చటి బట్టల్లో ఆధునిక పద్ధతిలో అలంకరించుకుని వింతగా వున్నదామె. మన్మధుడు సంధించడానికి

పెట్టుకున్న పువ్వుల పోగుల్లాంటి అవయవాలు ఆమెవి.

అతను బ్లాంక్‌గా ఆమెవేపు చూస్తూ కూచున్నాడు.

"నీకు జ్ఞాపకం వుందా, సోమయాజులు మేష్టరూ ఆయన జోక్సూ! పోస్టారి ఎకనామిక్స్ ఎసోసియేషన్ మీటింగులో మాట్లాడుతూ ఆయన....!" విరగబడి నవ్వుతూ ఏదో చెప్పుకుపోతోంది.

అలాటి ఏనెక్‌డోట్స్ చెప్పగలిగినన్ని చెప్పి ఆమె మంచంమీదినుంచి లేచింది.

"చలిగావుంది. కిటికీలు మూస్తానుండు."

కిటికీలలో ఆఖరుది రేడియో వెనకవుంది. అన్నీ అయ్యాక ఆ కిటికీ దగ్గరకు వచ్చిందామె. అతను తప్పుకోకుండా ఆ కిటికీ మూయ్యడం కష్టం.

అతను అలా చూస్తూ కూర్చున్నాడు. ఆమె కళ్ళలో అల్లరి అతనికి అర్థం కాలేదు. అతనిమీదికి వంగి ఆమె ఆ కిటికీ మూస్తున్నప్పుడు అతనిచుట్టూ వ్యాపించిన వాసన, అతని భుజం మీద ఆనుకొన్న మెత్తదనం అతను పట్టుకోలేనంత బరువైనవి.

కిటికీ మూసేసి ఆమె చీర సర్దుకుంటె అతనికి విచిత్రమైన ఆలోచన కలిగింది. మరుక్షణం అతను పెద్ద చర్చలోపడి పోయాడు.


తానెవరు? ఆమెవరు .. తను ఆమె గురించి ఆమె తనువు చూస్తే కొరపాటాలోచనలు చెయ్యడం లేదు కద! యిలా రాసుద్దరూ వొంటరిగా వుండడం కేవలం కాకతాళీయమే; ఎవరూ అనుకొని ఏర్పాటు చేసింది గాదు.

తనకూ ఆమెకీ చాలాదూరం! - తను ఆఫీసరు. రేపు ఆమె చెప్పినట్టు యస్. ఈ. వో. గా వస్తే కొన్నాళ్ళకి బి. డి. వో అవుతాడు. డెరెక్ట్ రిక్రూట్ గనక జిల్లాపరిషత్ సెక్రెటరీన్నీ కావచ్చు. ఆమె? - ఒక యమ్మెన్. - అదలావుండగా పెళ్ళి కాపరంలేక, వేరేస్త్రీని వివాహం చేసుకున్న పురుషుడితో. అనధికారపూర్వకమైన దాంపత్యం నడుపుతోంది. జి. ఓ. నెంబరు 468 లోని 5 వ పేరా 2 వ రూలు ప్రకారం ఈమెని ఎప్పుడు డిస్మిస్ చేసినా చెయ్యవచ్చు.

తాను యీ స్థితిలో ఏదయినా తప్పటడుగువేసి తొందరపడితే అంతా అభాసు అయిపోతుంది. అందరూ నవ్వుతారు. ఇది ఎలాగో కలెక్టరుగారి దృష్టిలో పడక మానదు. అమ్మబాబో- యింకేమయినా వుందా!

రేడియోలో ఇంగ్లీషు వార్తలు అయిపోయాయి. సరళబాల రేడియో మీదికి వంగి, అతనిమీద మత్తు వాసనలువొలకబోస్తూ సన్నని సంగీతం కోసం వెతుకుతోంది.

"ఛీ!" - విసిగిపోయి రేడియో ఆపేసింది సరళబాల. ఆ విసుగు రేడి




మూలో మంచి ప్రోగ్రాం రాకపోడం మీవనేనని రవణమూర్తి నమ్మాడు.

"పాటలంటే యిష్టంకాబోలు నీకు. రేడియోలో ఈ టైములో పాటలురావు. ప్రసంగాలు వస్తాయి." అని అతను పొడిగా నవ్వాడు.

"అన్నట్టు నీకు జ్ఞాపకం వుందా? గోపాల శర్మనీ, ఓ అతనుండేవాడు. సినీమా పాటలు చస్తేపాడను; నేను రాసినవే పాడుతాను అంటూవుండేవాడు – అతనురాసిన పాట మేం కాలేజి యానివర్సరీనాడు నాటకంలో పాడేం కూడాను – ఏంటమ్మా అదీ.... అనురాగ సుధామయ జీవితమూ – మన ప్రేమెకదా యిల శాశ్వతమూ – అనొస్తుంది ...బాగానే రాస్తాడుకదూ?"

అని సరళబాల మళ్ళా గతంలోకి వెళ్ళిపోయింది.

"ఔనౌను; అతను ఏదో మ్యూజిక్ కాంపిటీషన్లో గెల్చేడుకదూ"

"ఏం గెల్చాడు, అతనిమొహం. శేషగిరిరావు మేష్టారు ఆ విషయంలో పక్షపాతం చూపించారుసుమా. ఆ ప్రెయిజ్ అసలు శ్రీరామమూర్తికి రావలసింది ... .... సినిమా పాటలు కావని కొట్టిపారేసినాడు ఆయన; ఓల్డ్ క్యాట్!"

రవణమూర్తికి ఆవులింత వచ్చింది. "నాకో మంచంవుంటే అవతల పడెయ్యి. నిద్రొస్తూంది" అన్నాడు.

పకపకా నవ్వుతున్నసరళబాల పెదవులు బిగించి తలకిందికి వొంకరగా

వంచి, కనుబొమ్మలమీంచి అతనివేపు చూసింది.

"ఫూల్ !" అని తిట్టినట్టు వినిపించింది.

"ఈ రొజ్జగాలిలో ఈ చలిలో అవతలెలా పడుకుంటావు !" అని ఎవరో వెక్కిరించినట్టయింది.

తిట్టినా, వెక్కిరించినా అతనికి జవాబు చెప్పేటంతశక్తి లేనట్టు, తన్నుతాను నిగ్రహించుకో దల్చుకున్నాడు. ఆసమయంలో పరీక్షకు గురైనవాడి లాగ ఉక్కిరి బిక్కిరై వుండిపోయాడు. శరీరం ఆమోదిస్తున్న దాన్ని మనస్సు తిరస్కరిస్తున్నట్టు; పదునైన అతని దూరదృష్టి ఆ అవ్యవధి సంఘర్షణ తాకిడికి అయిష్టంగా వోడిపోయింది. ప్రతిఘటన పూర్తిగా తగ్గక; అతను కావలసినంత ఆవేశాన్ని సృష్టించుకోలేకపోయాడు.

అనుభూతిని కోరేది మనస్సు. ప్రసాదించేది శరీరం. అయినా, శరీరం ఒకసాధనమేగానిఅంతకంటె దానికేం పెత్తనంలేదు. ఇష్టమైన మనిషితో పొందునుంచి; ఇష్టమైన వస్తువు భోజనంవరకు - మనస్సు అడిగితేనే శరీరం పొందాలి- మనసు వద్దన్న క్షణంలో మధురాతి మధురమైన అనుభవంకూడా విషపూరితం అయిపోతుంది.

మధ్యాహ్నం భోజనంకూడా లేకుండా, రవణమూర్తి అక్కడికి ఆరుమైళ్ళు దూరంలోఉన్న ఒక గ్రామంలో ఎన్క్వయిరీ ఒకటి పూర్తిచేసుకొని, రాజుపాలెం చేరేటప్పటికి సాయింకాలం నాలుగు దాటుతోంది.

అగ్రహారాలచట్ట ప్రకారం గవర్నమెంటు అధీనమైన కొన్ని గ్రామాల కరణాలకు, ఇనాందారకు ఆనాడు అక్కడికి రమ్మని నోటీసులు జారీ చేసేడతను.

రాజుపాలెం రాగానే వాళ్ళు "పొద్దు పోతున్నది. మా కాగితాలు చూచి పంపెయ్యం"డని వాళ్ళుచుట్టుముట్టారు. వాళ్ళతో పనయ్యేటప్పటికి ఏడుకావస్తున్నది.

మళ్ళీ బస్సుల్లేవు....రాత్రికి ఆగిపోవాలి.

"బాగానే వుంటుంది ..." అనుకున్నాడు రవణమూర్తి. అతని ముఖం మీన క్షణంలో సగంసేపు చిరునవ్వు వెలిగింది.

"సత్తెనపల్లి వరకు నిన్నటమ్మను జీపు అడగండయ్యా పోదాం ! అక్కడింకా లాస్టుబస్సుంటుంది" అన్నాడు జవాను సైదారావు.

"సరే; నువ్వికక్కడేవుండు.వస్తాను" అని బయలేదాడతను.

కనుచీకటి పడింది, రకరకాల భావాలనూ వాటి నీడలనూ అనుభవించ లేకా తొక్కిపెట్టుకోలేకా అవస్థపడుతూ అతను సరళబాల ఇల్లు చేరాడు.

వరండాలో రెండు కుర్చీలు పరిచి వున్నాయి. మధ్యనున్న చిన్న స్టూల్ మీద ఆష్ ట్రే వుంది.

గడచిన రాత్రి సరళబాల వెయ్యగా తను నిద్రపోయిన మంచం యింకా వరండాలో వుంది.

హాల్లో లైటు వెలుగుతోంది. అతను చరచర లోపలికి వెళ్ళేడు. మనిషి అలికిడి లేదు.

"సరళబాలా!..." అనిపిల్చాడు. జవాబులేదు. విశాలమైన ఆహాలు ఏదో భయంకరమైన చప్పుడులాగ ప్రతి ధ్వనిస్తే తన పిలుపులోని ధ్వనికి తనే ఉలిక్కిపడ్డాడతను.

కాసేపటికి రెండోపిలుపు లేకుండానే బాత్‌రూమ్‌లోంచి "వస్తున్నా. ఎవరది? గదిలో కూర్చోవచ్చు." అని వినిపించింది.

రెండు నిమిషాలపాటు గదిలో కుర్చీలో కూర్చున్నాడు రమణమూర్తి. బాత్రూమ్ స్లిప్పర్స్‌తో డుక్కుని మెత్తని చప్పుడు చేసుకుంటూ సరళబాల వస్తూ వుంటే అతని గుండె జోరుగా కొట్టుకుంది. కళ్ళలో అతని కెప్పుడూ కనబడని కొత్తకాంతి విజృంభించింది. చిక్కబట్టుకోవలసిన భావాల్నీ మనస్సునీ అంతకుముందు రోజున జరిగిన ఉదంతంతోనూ, ఆ సంధ్యాసమయం, ఏకాంతం చేసిన వుపోద్ఘాతంతో నూ చిక్కబట్టుకోలేక పోయాడతను.

సన్నని చీరని చేతికెలాగవ అలాగ చుట్టబెట్టుకొని కడిగిన ముత్యంలావచ్చింది సరళబాల. నాలుగ్గజాల చీర చేతుల్లోనే వుంది.

అతను చిరునవ్వు నవ్వాడు.

సరళబాల నవ్వలేదు.

నున్నని ఆమె బుజాలమీద; దండల మీద, బుగ్గమీద, నాలుగైదు నీటిబొట్లు తువాలుకి లొంగకుండా నిలబడి వున్నాయి. అవిశుక్తిలోబడి మణిత్వము గాంచవలసిన నళినీదళ సంస్థిత ఉదక బిందువులు. పేరుకుపోయినజడత్వాన్ని కరిగించే చురుకుతనం, వేడిమి, ఆ ముత్యాల కాంతికి వున్నది.

అతను లేచి రెండడుగులు వేసి ఆమెకి ఎదురుగా వెళ్ళాడు. "ఎలాగో యింతకాలం నిర్లక్ష్యం చేసేశాను; అయిందేదో అయింది" అని తొందర పడ్డవాడిలాగ, తొందరగా ఆమెను చేరుకున్నాడు, స్వంతవస్తువును పట్టుకొనేటంత ధైర్యంగా, ఆమెను రెండు చేతులా పొదివి పట్టుకొని అతిసుందరమైన మౌక్తికానికి ఆశ్రయం యిచ్చిన ఎడంబుగ్గమీద గట్టిగా ముద్దుపెట్టాడు.

ఆర్ద్రంగా కాంతులీనుతున్న ముత్యపు బిందువు తప్తలోహపు తాకిడికి అనామకమై నశించి, బుగ్గకమిలి గుర్తుపడ్డాది.

మరుక్షణం — హవాయి శాండిల్ అతని ఎడం చెంపమీదా కుడిచెంపమీదా టపాటపా ఒక డజనుసార్లు నాట్యం చేసింది.

నిర్ఘాంతపోయాడతను.

"రాస్కెల్! దున్నపోతా! అన్వర్రీ ఫెలో - గెటౌట్!" అని అరిచి, అలసిపోయింది సరళబాల.

"నే చేసింది నువు కోరిందికాదా!" అన్నట్టు తెల్లబోయి ఇంకా అక్కడే నిలుచున్నాడతను.

"పోతావా లేదా! అరవిజెంతువు! కదలవేం!" అని అరిచింది మళ్లా ఆమె. అరచి మంచంమీద కూర్చొబడి పోయింది.

చెంపలు రెండిట్నీ వాక్కసాకే ఒక్క చేత్తోనే సంపర్కం చూసి రాసుకున్నాడతను. ఇది నిజమెలా అయిందో అర్థం గావడంలేదు. అలాగే అటు చూస్తూ వెరకవించి తనని తప్పించుకు వచ్చిన కొత్త మనిషిని చూసి బెదిరి, దూరం జరిగేడు.

ఒచ్చిన మనిషి రవణమూర్తికేసి అరనిమిషంపాటు పాలోచనగా చూసి, ఇటు సరళబాల వేపు ఆమెవున్నస్థితి అర్థం చేసుకొనేటంతసేపు చూసి: చిరునవ్వుతో ఆమె దగ్గర కెళ్లాడు.

"బాలా!"

సరళబాల తలెత్తి చూసింది. అత నామెని లేవదీసి దగ్గరిగా తీసుకుని. చిన్నపిల్లకి దెబ్బ తగిలితే పెద్దవాళ్ళు ఆ చోట రాసినట్టు ఆమె బుగ్గమీద ఆమె చెయ్యి తీసేసి తన చేత్తో సన్నంగా నిమురుతూ-"ఏదో-తొందర పడ్డట్టున్నావు-" అన్నాడు లాలనగా.

రవణమూర్తికి ఆ దృశ్యం చూడడానికి ధైర్యం చాలలేదు. నిమిషం క్రితం రుద్రమూంబా భద్రకాళీలాగ విజృంభించి, అర నిమిషంలోగా టన్ను మంచుగడ్డ కరిగినట్లు నీరుగారి పోయిన సరళబాల అతని చేతుల్లో పెంపుడు పావురంలా ముడుచుకు పోవడానికి కారణమేమిటో! అని తెల్లబోతూ చెంపలు రాసుకుంటూ అతను ఇవతలి కొచ్చాడు.

ఎదురుగా సైదారావు వస్తున్నాడు.

"సార్! గుంటూరు పోయ్యే లాస్టు బస్సు పిడుగురాళ్ళకాడ చెడిందట సార్. ఇగనో ఇప్పుడో వస్తుందంట. పోదాంరండి సార్" అన్నాడు సైదారావు ఆదుర్దాతో.

"పద" అన్నాడు రవణమూర్తి.

అతనికేమీ అర్థం కాలేదు.

•••

**రచయితలకు మనవి**

"జ్యోతి"కి రచనలు పంపే వారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పి పంపగోరితే రచనతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతోపాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని. అట్టివారికి రచనలు త్రిప్పిపంపడం కష్టసాధ్యమని గుర్తించాలని మా విజ్ఞప్తి.